ప్రత్యేక ఆకర్షణగా టీ షర్టులు, టోపీలు


తాండూరు, మే12: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో ప్రత్యేకత సంతరించుకుంది. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 12రకాల వస్తువులున్న మెటిరియల్ కిట్‌ను పోలింగ్ సిబ్బందికి అందజేశారు. ఇందులో టూత్‌పేస్ట్, బ్రష్, షాంపు, బిస్కెట్, దువ్వెన, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, స్నాక్స్‌లను అందజేశారు. దేశ్ కా గౌరవ్ పేరిట వలంటీర్లకు ప్రత్యేకంగా టీ షర్టులు, 'ఎన్నికల పర్వం.. దేశానికి గర్వం' నినాదంతో టోపీలను సిబ్బందికి అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్ తరలింపు

రంగారెడ్డి అర్బన్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి) మే12 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఓట్ల లెక్కింపు కేంద్రానికి (గొల్లపల్లిలోని బీఎస్ ఐటీ కాలేజీ-స్ట్రాంగ్‌రూమ్) తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి శశాంక పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ఆదివారం కొనసాగింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను ముందుగా జిల్లా కలెక్టరేట్ లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చగా, వాటిని పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రత్యేక కంటైనర్ వాహనంలోస్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియాతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున వారి ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్‌లను జాగ్రత్తగా భద్రపర్చి, స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు.


కీసరలోని హోళీ మేరీ కాలేజీలో

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఆదివారం మేడ్చల్ జిల్లా కీసరలోని హోళీ మేరీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పోలైన పోస్టల్ బ్యాలెట్ సీల్డ్ బాక్సులను పోలీసు బందోబస్తు నడుమ హోళీమేరీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో వివిధ పార్టీల నాయకుల ఏజెంట్‌ల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కొడంగల్‌లో ఓటేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి



వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి)/కొడంగల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లు జిల్లాలో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సోమవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రికి కొడంగల్ చేరుకున్నారు. ఉదయం జడ్పీ ఉన్నత పాఠశాలలో రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేస్తారు. సీఎం కొడంగల్ పర్యటన సందర్భంగా అధికారులు భద్రాత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలా ఉంటే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వికారాబాద్ నియోజకవర్గం, మర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



వికారాబాద్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ

ఓటుకు వేళాయె!

నేడే లోక్‌సభ ఎన్నికల పోలింగ్



చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ల పరిధిలో నేడు జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎం యంత్రాలు, పోలింగ్ సామగ్రిని అప్పగించారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీడ, తాగునీటి వసతిని కల్పిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో తరలి వెళ్లారు.

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
- నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్ షురూ
- చేవెళ్ల పార్లమెంట్‌లో 2,877... మల్కాజ్‌గిరిలో 3,228 పోలింగ్ కేంద్రాలు
- చేవెళ్ల బరిలో 43, మల్కాజ్‌గిరిలో 22 మంది

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/ మేడ్చల్/ రంగారెడ్డి అర్బన్, మే 12 : లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఇక పోలింగ్ మిగిలింది. నేడు జరిగే పోలింగ్ కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. చేవెళ్ల పార్లమెంటు బరిలో 43 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఏఆర్వోల పర్యవేక్షణలో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పగించారు. చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీ, శేరిలింగంపల్లిలోని ఇండోర్ స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించారు. తాగునీరు, వైద్య శిబిరం, అల్పాహారం, భోజనవసతి, టెంటు వంటి వసతులను పరిశీలించారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని సరిచూసుకున్న తర్వాత మధ్యాహ్న భోజనం ముగించుకుని సెక్టోరల్


మిగతా 5వ పేజీలో...





చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం


(అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు)
























మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం


(అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు)
















మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ వివరాలు

అసెంబ్లీ నియోజక వర్గాలు	07
బరిలో అభ్యర్థులు	22
మొత్తం ఓటర్లు	39,79,596
పురుషులు	19,45,624
మహిళలు	18,33,430
ఇతరులు	542
పోలింగ్ కేంద్రాలు	3,228
సమస్యాత్మక కేంద్రాలు	407
కంట్రోల్ యూనిట్లు	713
బ్యాలెట్ యూనిట్లు	1,428
ప్రిసైడింగ్ అధికారులు	3679
పోలింగ్ అధికారులు	12,026
మైక్రో అబ్జర్వర్లు	204
అదనపు సిబ్బంది	2,860

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ పీఎస్‌లు	అనుబంధ పీఎస్‌లు	మొత్తం పీఎస్‌లు	పీఎస్ లొకేషన్లు	క్రిటికల్ పీఎస్‌లు	క్రిటికల్ పీఎస్ లొకేషన్లు
మహేశ్వరం	511	26	537	207	56	20
రాజేంద్రనగర్	535	08	543	158	119	26
శేరిలింగంపల్లి	622	11	633	197	57	14
చేవెళ్ల	298	0	298	172	48	18
పరిగి	305	0	305	165	72	25
వికారాబాద్	284	0	284	160	65	22
తాండూరు	269	8	277	163	54	17
మొత్తం	2,824	53	2,877	1,222	471	142


బీజేపీలో చేరుతున్న నాగిరెడ్డిపల్లె తండా బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరంలో బీజేపీకి తిరుగులేదు

మహేశ్వరం, మే 12 : దేశంలో నరేంద్రమోదీకి ఎదురులేదు.. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీకి తిరుగులేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపల్లె తండాకు చెందిన 20మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్. మాధవాచారి ఆధ్వర్యంలో బొక్క నర్సింహారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ బలం రోజురోజుకూ పెరుగుతోందని, ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల వారు రోజూ వందల మంది బీజేపీలో చేరుతున్నారన్నారు. బీజేపీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములుయాదవ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, దేశ్యానాయక్, వెంకటేష్, చెన్నారెడ్డి, కిషన్, మనోహర్, భాస్కర్, సురేందర్‌చారి, కృష్ణానాయక్, రాజేష్, దేవ్లా, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పటిష్ట భద్రత

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి ● సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

ఆమనగల్లు, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుశాఖ పరంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల పోలీసుస్టేషన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం డీసీపీ నారాయణరెడ్డితో కలిసి సీపీ పర్యటించారు. కడ్తాల పోలీసుస్టేషన్‌ను సందర్శించి ఎన్నికల భద్రత ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలు, రూట్‌లు, సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితులపై అడిషనల్ డీసీపీ రాంకుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీ ఆదేశించారు. బందోబస్తు విధుల్లో ఎక్కడా అలసత్వానికి తావివ్వొద్దన్నారు. అనంతరం కడ్తాల బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నుంచి ఆమనగల్లుకు చేరుకొని బాలుర పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమనగల్లులో విలేకరులతో సీపీ అవినాష్ మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఎన్నికలకు తగిన భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. 9వేల మంది కేంద్రీయ, సాయుధ, స్థానిక పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. 90 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మొబైల్‌టీంలను ఏర్పాటు సిద్ధంగా ఉంచామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని సీపీ కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రాంకుమార్, శ్రీనివాస్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్సైలు బలరాంనాయక్, వరప్రసాద్ ఉన్నారు.


కడ్తాల పోలీస్ స్టేషన్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న సీపీ మహంతి


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎర్రోనిగూడ బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

షాబాద్, మే 12 : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి భీం భరత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌గూడలో దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, ఎర్రోనిగూడ మాజీ వార్డు సభ్యుడు మల్లారెడ్డి గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, నాయకులు వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, పెంటారెడ్డి, వేణు, శేఖర్, ప్రశాంత్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ఓటుహక్కు వినియోగించుకోవాలి

కందుకూరు, మే 12 : దేశం కోసం, ధర్మం కోసం ప్రతీ ఓటరు తమఓటుహక్కును వినియోగించుకోవాలని బీజేపీ జాతీయ నాయకులు బస్వ పాపయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. ఆదివారం కందుకూరులో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఓటరు విధిగా ఓటువేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, అనెగౌని అశోక్‌గౌడ్, మహేందర్, జవహర్‌నాయక్, జి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాపయ్యగౌడ్, నర్సింహారెడ్డి

కేంద్రమంత్రిని కలిసిన మున్సిపల్ పాలకవర్గం

ఆమనగల్లు, మే 12 : కేంద్ర సమాచారశాఖ మంత్రి మురుగన్‌ను ఆదివారం ఆమనగల్లు మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌ఛైర్మన్ దుర్గయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయానికి వచ్చిన కేంద్ర మంత్రి వారు కలిసి శాలువాలతో సత్కరించారు. మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, తల్లోజు విజయ్ కృష్ణ, శ్రీధర్, ఝాన్సీశేఖర్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు నర్సింహ, కండె సాయి, రాందాస్, రెడ్యానాయక్ ఉన్నారు.


కేంద్ర మంత్రి మురుగన్‌తో మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్, వైస్ ఛైర్మన్ దుర్గయ్య

గిరిజనుల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్

కొత్తూర్, మే 12 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ, ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌గుడి తండాలో నిర్వహిస్తున్న సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ, దుర్గభవానీ ఆలయ వార్షికోత్సవాల్లో వారు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజనులు 9రోజుల పాటు దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాందాస్‌నాయక్, రవినాయక్, సత్తయ్య, దయానంద్‌గుప్తా, లక్ష్మణ్‌నాయక్, లోబ్యానాయక్, మెహన్‌నాయక్, చందర్‌నాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.


భవానీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

ఘనంగా రామానుజ జయంతి వేడుకలు

కడ్తాల్, మే 12 : మండల పరిధి మక్తమాదారంలో గల రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో రామానుజాచార్య జయంతి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త తిరుమల వింజమూరు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, వేణుగోపాలస్వామి, రామానుజులకు తిరుమంజనం, గంధావళి ఉత్సవం, తిరువాయ్ నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, అర్చకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులకు అధికారుల డుమ్మా

● 40 మందిపై చర్యలకు సిఫారసులు

● కలెక్టర్‌కు నివేదించిన తాండూరు ఏఆర్‌వో

తాండూరు, మే 12: పార్లమెంటు ఎన్నికల విధులకు అధికారులు డుమ్మా కొట్టారు. ఆదివారం ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన 40మంది అధికారులు గైర్హాజరు కావడంతో తాండూరు ఎన్నికల నిర్వాహణ అధికారులు ఇబ్బందిపడ్డారు. దీంతో తాండూరు ఎన్నికల సహాయ అధికారి శ్రీనివాస్‌రావు గైర్హాజరైన 40మంది అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికారాబాద్ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తాండూరు నియోజకవర్గానికి పీవోలు, ఏపీఓలు, ఓపివోలతో పాటు దాదాపు 1400మంది అధికారులను నియమించారు. గత కొన్ని రోజులుగా వారికి శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం (నేడు) నిర్వహించే ఎన్నికల సందర్భంగా తాండూరు ఆర్డీవో, ఎన్నికల సహాయ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను నిర్వహించారు. వెంటనే తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విధులకు హాజరుకాని అధికారులపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఏకంగా సస్పెండ్ కూడా చేసే అవకాశం ఉంటుందని ఆర్డీవో శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. మరోవైపు విధులకు గైర్హాజరు అవుతున్న అధికారుల స్థానంలో రిజర్వుగా ఉన్న ఏపీఓ, ఓపీఓలను నియమించేందుకు ట్రెయినీ అసిసెంట్ కలెక్టర్ ఉమాహారతి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎన్నికల విధులకు గైర్హాజరైన అధికారుల సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోలింగ్ కేంద్రం లేక ఇబ్బందులు

మర్పల్లి, మే 12: తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని తండావాసులు వాపోయారు. గుర్రంగట్టు తండాలో మొత్తం 270 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 180, మహిళలు 90 మంది ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బూచన్‌పల్లి గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు రాంపూర్, పట్లూర్ తండా గ్రామస్థులు పట్లూర్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోయారు. కురుగుంట గ్రామస్థులు సైతం పెద్దపూర్ గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

నా ఓటు ఏమైంది?

● కుప్పన్‌కోట్‌లో ఓటరు ఆవేదన


ధనవాత్ గోపాల్

బషీరాబాద్, మే 12: ప్రజాసామ్యం కల్పించిన ఓటు హక్కు తనకు లేకుండా చేశారని బషీరాబాద్ మండలం కుప్పన్‌కోట్ గ్రామానికి చెందిన గిరిజనుడు ధనవత్‌గోపాల్ ఆదివారం ఆందోళన వ్యక్తం చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశానని, లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు లిస్టులో పేరు తొలగించినట్లు వచ్చిందన్నారు. ఓటరు లిస్టులో డిలెట్-2 అని వచ్చిందని, తన ఓటు ఎమైన్లని ప్రశ్నించాడు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి, తాండూరులోని ఆర్డీవో కార్యాలయానికి తిరిగిన ఓటరు లిస్టులో పేరు రాలేదని ఆరోపించారు. ఓటరు లిస్టులో పేరు తొలగింపులో తప్పిదం ఎవరిదో కానీ తాను బతికుండగానే ఓటు హక్కుకు దూరం కావడం భరించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను అడిగితే డబుల్ ఓటు ఉంటే బీఎల్‌వోలు తొలగింపునకు సిఫారసు చేస్తారని చెప్పుకొచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేలా అధికారులు తనకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాడు.


ఎక్మాయిలో పోలింగ్ కేంద్రం వద్ద గాలి దుమారానికి నేలకొరిగిన టెంట్

బషీరాబాద్‌లో భారీ వర్షం

బషీరాబాద్, మే 12: మండలంలోని ఎక్మాయి, మైల్వార్, మంతన్‌గౌడ్, బషీరాబాద్ తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంట పాటు ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా వర్షం కురువడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఒక్క సారిగా ఊపిరిపీల్చుకున్నారు. ఎండల నుంచి కాస్త ఉపశమనం లభించిందని చర్చించుకున్నారు. సాయంత్రం వేళ ఆయా గ్రామాలకు లోక్‌సభ ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్న సిబ్బంది వర్షంతో కొంత ఇబ్బందులుపడ్డారు. ఎక్మాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద గాలి దుమారానికి టెంట్ నెల కూలిపోయింది. స్థానిక పంచాయతీ కార్యదర్శి రవి వర్షం తగ్గడంతో సరి చేయించి ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ హోమం

శామీర్‌పేట, మే 12: మండల కేంద్రం శామీర్‌పేటలో మూడు రోజులుగా శతచండీ హోమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. గడియారం మురళిధర్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శతచండీ పారాయణం, శతచండీ హోమం జరిపారు. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, వృత్తికరణం, స్థాపితదేవతా ఆహ్వానంతో ఈ శతచండీ హోమాన్ని ప్రారంభించారు. మూడు రోజులుగా 16 మంది వేదపండిత బ్రహ్మణుల వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. ఆదివారం చివరిరోజు సాయంత్రం పూర్ణాహుతి గావించారు.

ఓటర్లకు డబ్బు ఎర!

కులకచర్ల, మే 12: పార్లమెంట్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీల నాయకులు శని, ఆదివారం రాత్రుల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఓ పార్టీకి చెందిన నాయకుడికి ఇంటికి రాత్రికి రాత్రే పెద్ద మొత్తంలో డబ్బులు చేరాయన్న ప్రచారం జరిగింది. ఓటుకు రూ.200 నుంచి రూ.500 వరకు పంపిణీ చేశారు. ఎంత లేదన్నా ఇప్పటి వరకు ఖర్చు చేసిన దాని కంటే అదనంగా కులకచర్ల మండలంలోని ఆయాపార్టీలు డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమకు ఓట్లు పడతాయనే ప్రాంతాలకు, పల్లెల్లోని చోటా నేతలకు నగదును రహస్యంగానే అందించినట్లు సమాచారం. ఈ నేతలు ఎన్నికల సంఘం కళ్లుగప్పి విచ్చలవిగా డబ్బులను పంపిణీ చేసినట్లు తెలిసింది. తమకు అనుకూలంగా లేని ఓటర్లను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అలాంటి వారికి నోటుతో పాటు అదనంగా మద్యం పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా కొంత మంది పార్టీల నాయకులు నిఘా పెరగక ముందే భారీ మొత్తంలో డబ్బులు తీసుకొచ్చి గ్రామాల్లో నమ్మకస్తులైన నేతల దగ్గర ఉంచారు. గ్రామాల్లో ఓటుకు రూ.200 నుంచి రూ.500తో పాటు క్వాటర్, విస్కీ బాటిల్ తాయిళంగా అందించారు. మరికొన్ని చోట్ల మహిళా సంఘాలకు, యువజన సంఘాలకు కూడా డబ్బు పంపిణీ చేసినట్లు సమాచారం. మరికొన్ని గంటల్లో ఓటింగ్ ప్రారంభం కానుంది. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచిచూడాలి మరి.

ఓటుకు వేళాయె!

(మూడో పేజీ తరువాయి)

అధికారుల ఆధ్వర్యంలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి భారీ బందోబస్తు మధ్య చేరుకున్నారు. పోలింగ్‌కు ఈవీఎంలను సిద్ధం చేశారు. జిల్లాలో 3,595 సీయులు, 3,595 బీయూలు, 4,028 వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేశారు. పీవోలు 3,093, ఏపీవోలు 3,450, ఓపీవోలు 6,900 విధుల్లో పాల్గొంటున్నారు. నేడు ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్‌లో 50 ఓట్లు పోల్ చేసి సరిచూశాక వాటిని తొలగిస్తారు. ఏజెంట్లు రాకుంటే 15 నిమిషాలు వేచి చూసి మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. నేడు 7 గంటలకు పోలింగ్ ప్రారంభించనున్నారు. ఈవీఎంలు ఎక్కడ మొరాయించినా అరగంటలో మార్చేందుకు సెక్టొరల్ అధికారుల వద్ద రిజర్వులో ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు నీడనందించేందుకు టెంట్లు, టాయిలెట్స్, ర్యాంపు, వీల్ చైర్, తాగునీరు, ఫ్యాన్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 216 మంది సూక్ష్మ పరిశీలకులు 471 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేయడానికి వచ్చేవారికి విధిగా గుర్తింపు కార్డు తప్పనిసరి. 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానికి తీసుకు వెళ్లాలి, ఓటరు కార్డు కలిగిన వారు దానిని పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు కార్డుగా చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, పాస్‌బుక్, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్‌ను కూడా చూపించి ఓటు వేయవచ్చు.

29,38,370 ఓటర్లు... 2,877 పోలింగ్ కేంద్రాలు

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 29,38,370 ఓటర్లు ఉన్నారు. పురుషుల ఓటర్లు 15,04,260 ఉండగా, మహిళా ఓటర్లు 14,33,830 ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 280 మంది ఉన్నారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడ ఎన్నికల కమిషన్ 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో 994 మంది ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ వ్యాప్తంగా నేడు జరుగనున్న ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు డీఆర్‌సీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అధికారులు అందజేశారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం లోపే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండటంతో ఉదయం నుండే పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. కీసరలోని డీఆర్‌సీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పోట్రు పరిశీలించారు. అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. పార్లమెంటు నియోజకవర్గం వ్యాప్తంగా 3228 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ప్రక్రియ పరిశీలనకు ఇద్దరు అబ్జర్వర్లను , స్క్వాడ్లను నియమించారు.

కూకట్‌పల్లి నియోజకవర్గం అత్యధికం..

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 3,228 పోలింగ్ కేంద్రాలున్నాయి. గత అసెంబ్లీ లేదా ఇదివరకు ఎన్నికలు జరిగిన పోలింగ్ కేంద్రాల్లో గొడవలు, అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పార్లమెంటు పరిధిలో 407 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. ఇందులో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 93, మేడ్చల్‌లో 71, మల్కాజిగిరిలో 60, కుత్బుల్లాపూర్‌లో 70, ఉప్పల్‌లో 22, ఎల్‌బీనగర్‌లో 71, కంటోన్మెంట్‌లో 20 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి.



రాజేంద్రనగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది



మేడ్చల్: పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో తరలుతున్న సిబ్బంది

నిర్భయంగా ఓటు వేయండి

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేయాలి. నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా తీసుకువెళ్లాలి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ సారి పోలింగ్‌శాతం పెంచేందుకు అన్ని నియోజకవర్గాల్లో అవగాహన కల్పించడం జరిగింది. ఇప్పటి వరకు 99.23 శాతం ఓటరు సమాచర స్లిప్పులు అందించడం జరిగింది. జిల్లాలో 2877 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. బరిలో 43 మంది అభ్యర్థులు ఉన్నందున పోలింగ్ కోసం మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నాం. నిర్భయంగా ఓటు వేయాలి.

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది వివరాలు

నియోజకవర్గం	పీవోలు	ఏపీవోలు	ఓపీవోలు	పీఎస్‌లు	సెక్టోర్ అధికారులు
మహేశ్వరం	644	644	1288	511	48
రాజేంద్రనగర్	651	651	1302	535	49
శేరిలింగంపల్లి	759	759	1518	622	57
చేవెళ	357	357	714	298	26
పరిగి	283	283	566	305	27
వికారాబాద్	341	341	682	284	26
తాండూరు	332	332	664	269	26
మొత్తం	3,093	3,450	6,900	2,824	259

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంల వివరాలు

నియోజకవర్గం	పీఎస్‌లు	సీయు	బీయు	వీవీప్యాట్స్
మహేశ్వరం	537	671	671	752
రాజేంద్రనగర్	543	679	679	760
శేరిలింగంపల్లి	633	791	791	886
చేవెళ	298	372	372	417
పరిగి	305	381	381	427
వికారాబాద్	284	355	355	398
తాండూరు	277	346	346	388

మల్కాజ్‌గిరి పార్లమెంటు బరిలో అభ్యర్థులు

క్ర.సం	అభ్యర్థి	పార్టీ
1	పట్నం సునీతారెడ్డి	కాంగ్రెస్
2	ఈటల రాజేందర్	బీజేపీ
3	రాగిడి లక్ష్మారెడ్డి	బీఆర్‌ఎస్
4	శీలం అనిత	బీఎస్‌పీ
5	కొండా అప్పారావు	ఆర్‌ఎస్‌పీపీ
6	చామకూర రాజయ్య	ఎస్‌జేపీఐ
7	జువ్వా ఫణికుమార్	జైబీఎన్‌పీ
8	పెద్దపల్లి సందీప్	బీయూడీ
9	బోయిన దుర్గాప్రసాద్ యాదవ్	డీఎస్‌పీ
10	నక్కయాదీశ్వర్	టీపీపీ
11	నర్రా సుఖేందర్‌రెడ్డి	వీఆర్‌పీ
12	కంటే సాయన్న	ఇండిపెండెంట్
13	చిరిపిరెడ్డి రమేష్	ఇండిపెండెంట్
14	దొంతుల బిక్షపతి	ఇండిపెండెంట్
15	పెసరికాయల పరీక్షిత్తురెడ్డి	ఇండిపెండెంట్
16	బంజపల్లి సుధారాణి	ఇండిపెండెంట్
17	మౌతం సంపత్	ఇండిపెండెంట్
18	రాజేష్ మిశ్రా	ఇండిపెండెంట్
19	తల్లాడ వెంకటేశ్వర్లు	ఇండిపెండెంట్
20	పెండ్యాల శేషసాయి వరప్రసాద్	ఇండిపెండెంట్.
21	భారత సుదర్శన్	ఇండిపెండెంట్
22	ఆర్.సుఖేందర్‌సింగ్	ఇండిపెండెంట్

చేవెళ్ల బరిలో నిలిచిన అభ్యర్థులు

క్ర.సం	అభ్యర్థి	పార్టీ
1	కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్	బీఆర్‌ఎస్
2	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ
3	డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి	కాంగ్రెస్
4	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	ఏఐఎఫ్‌బీ
5	పి.గోవింద్	బీఎంపీబి
6	చింతలగారి వెంకటస్వామి	బీఐపీ
7	తోట్ల రాఘవేందర్ ముదిరాజ్	డీఎస్‌పీ
8	దుర్గాప్రసాద్. టి	పీవీపీ
9	నర్సింహారెడ్డి ద్యాప	టీఆర్‌పీ
10	పాలమాకుల మధు	ఐపీబీపీ
1	ఫణిప్రసాద్ కటకం	ఎస్‌జేపీఐ
12	మహ్మద్ అబ్దుల్‌ఖావి అబ్బాసి	ఏఐఎంఈఈఈఎం
13	మహ్మద్ సలీం	ఆర్‌పీసీ(సెక్యులర్)
14	మహ్మద్ షకీల్	దేశ్ జనహిత్ పార్టీ
15	బీవీ రమేష్ నాయుడు	సోషల్‌పార్టీ (ఇండియా)
16	రాములు బింగి	యుగ తులసి పార్టీ
17	రంజిత్‌రెడ్డి గాదె	ఆర్‌ఎస్‌పీ
18	శ్రీదేవి యం	ఏడీఆర్‌పీ
19	సానెం రాజుగౌడ్	ప్రజాఏక్తాపార్టీ
20	సుగురు శ్రీనివాస్	జైస్వరాజ్
21	సుధాకర్ వనం	ఎంసీపీఐయూ
22	సేరుబాయి వసంత్‌కుమార్	ఆర్‌ఎస్‌పీపీ
23	అమీర్ సాజిద్	ఇండిపెండెంట్
24	అంకగాల ప్రవీణ్‌కుమార్	ఇండిపెండెంట్
25	ఆంజనేయులు నీరటి	ఇండిపెండెంట్
26	ఈసరి సూర్యప్రకాశ్‌రెడ్డి	ఇండిపెండెంట్
27	కత్తుల యాదయ్య	ఇండిపెండెంట్
28	కావలి సుకుమార్	ఇండిపెండెంట్
29	కండికేకర్ శ్రీనివాస్	ఇండిపెండెంట్
30	గోనె శ్రీనివాస్‌రెడ్డి	ఇండిపెండెంట్
31	గోవింద్‌లాల్	ఇండిపెండెంట్
32	జనపాల దుర్గాప్రసాద్	ఇండిపెండెంట్
33	జలీల్ హైమద్	ఇండిపెండెంట్
34	వి.పాండు	ఇండిపెండెంట్
35	జి. మల్లేశంగౌడ్	ఇండిపెండెంట్
36	మహమ్మద్ ఇక్బాల్	ఇండిపెండెంట్
37	మహ్మద్ అఫ్సర్ ఖుద్దూస్	ఇండిపెండెంట్
38	మహ్మద్ అలీ	ఇండిపెండెంట్
39	మహ్మద్ పాషా	ఇండిపెండెంట్
40	మహమ్మద్ ముస్తాఫా రిజ్వాన్	ఇండిపెండెంట్
41	మహ్మద్ రియజుర్ రెహ్మన్ షేక్	ఇండిపెండెంట్
42	విశ్వకర్మ సప్తగిరి	ఇండిపెండెంట్
43	సాహితీ దాసరి	ఇండిపెండెంట్



వికారాబాద్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలి

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్/పరిగి, మే 12: నేడు జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు, సామగ్రి తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలో కేంద్రంలోని మేరి ఏ నాట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాన్ని సందర్శించారు. 284 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని, 26 రూట్లకు ఆయా సెక్టరియల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లతో తరలించినట్లు తెలిపారు. పోలింగ్ అధికారులు వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను పోలింగ్ సామగ్రిని చెక్ చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని, ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే పోలింగ్ ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. మొత్తం పోలైన ఓట్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. కాగా పరిగి మినీస్టేడియం మైదానంలో పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ, పోలింగ్ విధులు నిర్వహించే అధికారులంతా సమష్టిగా పని చేసి పోలింగ్ ప్రశాంతంగా పూర్తిగా చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే రూట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సీ వెల్ఫేర్ మల్లేశం, ఈఈపీఆర్ ఉమేష్ కుమార్, మైనార్టీ వెల్ఫేర్ సుధారాణి, డీఈవో రేణుక, సురేష్ బాబు, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర, స్వీప్ నోడల్ అధికారి సత్తార్, డీవైఎస్‌వో హన్మంత్‌రావు, తహసీల్దార్ ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

» జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, మే 12 : వికారాబాద్ జిల్లాలో నేడు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎలాంటి అలజడులు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో 45 కంపెనీల కేంద్ర బలగాలు, 14 కంపెనీలు టీఎస్‌ఎస్‌పీ బలగాలు, 750 మంది కర్ణాటక పోలీస్, జిల్లా శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న 260 మంది పోలీస్ అధికారులతో పాటు జిల్లా పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యవసరమైన సమయంలో స్పందించుటకు 19 స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌టీంలు, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సున్నితమైన అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో సీసీటీవీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా పోలింగ్ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాయిలాల పర్వం

» ఓటుకు రూ.500, మద్యం సీసా

వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రధాన పార్టీలు పోటాపోటీగా ప్రయత్నాలు కొనసాగించాయి. జిల్లాలో నువ్వా.. నేనా అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ నెలకొనడంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఆదివారం నగదు, మద్యం పంపిణీ చేశారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు ముందుగానే రహస్య ప్రాంతాలకు చేర్చిన నగదు, మద్యం ఆదివారం బయటకు తీసి పంపిణీ చేశారు. తాయిళాలకు ప్రభావితమయ్యే వర్గాలపై దృష్టి సారించిన ప్రధాన పార్టీల నేతలు తమకే ఓటు వేస్తారని భావించిన ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేశారు. ఒక్కో ఓటరుకు రూ.500 నగదుతో పాటు మద్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ నాయకులు కూడా ఓటర్లకు పోటాపోటీగా నగదు, మద్యం పంపిణీ చేశారు.

పోలింగ్‌కు నేడు అంతా సిద్ధం



మేడ్చల్ మే 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పోట్రు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని 3,228 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించామని, పోలింగ్ కేంద్రాలను ఓటర్లు గుర్తించేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. దూర ప్రాంతాల్లోని వృద్ధులు, దివ్యాంగులను కేంద్రాలకు తీసుకొచ్చేందుకు వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. అవసరాన్ని బట్టి రెండు ట్రై సైకిళ్లను సిద్ధం చేశామన్నారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, మిగతా కేంద్రాల కంటే వీటిని అందంగా తీర్చిదిద్దామన్నారు. మైక్రోఅబ్జర్వర్‌లు పోలింగ్ సరళిని పరిశీలిస్తారన్నారు. పోలింగ్ సిబ్బందిని 820 వాహనాల్లో తరలించామన్నారు. జీపీఎస్ ద్వారా కలెక్టరేట్ నుంచి వీటిని మానిటరింగ్ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే తెలిసిపోయేలా చర్యలు చేపట్టామన్నారు. ఈవీఎంలు మొరాయిస్తే 5 నుంచి 10 నిముషాల్లో సరిచేసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించరాదు..

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, క్యూలైన్‌లో ఉన్న వారిని మాత్రమే సాయంత్రం 6 తర్వాత ఓటు వేసేందుకు అనుమతిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ పార్టీల నాయకులు ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని, కేంద్రాల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత పటిష్టబందోబస్తుతో ఈవీఎంలను డీఆర్‌సీ కేంద్రానికి తరలిస్తామన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి...

ప్రజలందరూ తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రలోభాలకు గురికాకుండా నిక్కచ్చిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సోమవారం సాయంత్రంపోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్‌ను పాటించాల్సి ఉంటుందని, అదేవిధంగా డ్రైడేకు నిర్వహించిన జిల్లాలో ఉన్నటువంటి అన్ని మద్యం దుకాణాలను మూసివేయించామని తెలిపారు.

రసాయన ఎరువులతో చేటు!

» మోతాదుకు మించి వాడుతున్నరైతులు

» సహజత్వాన్ని కోల్పోతున్న నేల

» సేంద్రియ ఎరువుల వాడకంపై రైతుల అనాసక్తి

» సూచనలు పాటించాలంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

యాచారం, మే 12 : అధిక దిగుబడి సాధించేందుకు రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. పశువుల పేడ, గొర్లు మేకల ఎరువు, వర్మి కంపోస్టు, వానపాముల ఎరువుల తదితర సహజ ఎరువులు వాడకపోవడంతో రోజు రోజుకూ భూసారం తగ్గుతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం నేల సహజ స్వరూపాన్ని మార్చేస్తోంది. రసాయనాల ప్రభావంతో భూమిలోని ముతక లోహాలు క్షీణిస్తున్నాయి. ఇది మున్ముందు ప్రమాదకరం పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో భూసార పరీక్ష కేంద్రం ఉన్నా ఎక్కువ మంది రైతులు తమ భూమిలో మట్టి పరీక్షలు చేయించడం లేదు. మట్టి పరీక్షలు చేయిస్తే ఏ ఎరువులు ఎంత మేర వాడాలనే లెక్క ఉంటుంది. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి రైతులకు చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు.

గ్రామ స్థాయిల్లో పరీక్షలు చేస్తే మేలు!

నేడు ప్రతీ మండలంలో నాలుగు రైతు వేదికలు నిర్మించినా అక్కడ భూసార పరీక్షలు చేసే కిట్లను ఉంచడం లేదు. డివిజన్ పరిధిలోనో లేక మరెక్కడో కాకుండా క్లస్టర్ రైతు వేదికల్లో అయినా భూసార పరీక్షల నిర్వహిస్తే గ్రామాల్లోని చాలా మంది తమ పొలాల మట్టిని సేకరించి పరీక్ష చేయించే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఎక్కడో దూరానికి మట్టిని తీసుకుళ్లడం, మట్టి పరీక్ష ఫలితాల కోసం చాలారోజుల పాటు వేచి చూడడం వంటి పరిస్థితుల వల్లే రైతులు భూసార పరీక్షలకు పెద్దగా ఆసక్తి చూడపం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించక కూడా భూమి సహజత్వాన్ని కోల్పోతోంది. ఏడాదిలో ఒక భూమిలో కనీసం రెండే వేర్వేరు పంటలు పండించాలి. అలా చేస్తేనే అన్ని రకాల సారం పంటలకు అంది దిగుబడి పెరుగుతుంది. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గే ఆస్కారం ఉంటుంది. వరి సాగుకు ఎకరానికి ఒక బస్తా యూరియా వాడాలి. రైతులు మూడు, నాలుగు బస్తాలు చల్లుతున్నారు. సహజ ఎరువులను ఎంత వాడినా నేల స్వభావం మారదని, కానీ రసాయ ఎరువుల ఎంత ఎక్కువ వాడితే నేల అంత పాడై రానురాను మొక్కల ఎదుగులే లేకుండా పోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



యాచారంలో పొలాన్ని చదును చేసిన రైతు

నేలకు సారాన్నిచ్చే చెరువు, కుంటల మట్టి

మెట్ట పంటలకు టిక్కిమట్టితో పాటు పశువులపేడ, మేకల, గొర్రెల ఎరువు, కోడి ఎరువు వాడితే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. టిక్కి మట్టిలో హ్యూమస్ ఉండి నేల సారవంతంగా మారుతుందన్నారు. ఎలాంటి నేలనైనా పంటలకు అనుగుణంగా మార్చే శక్తి చెర్లు, కుంటల్లోని మట్టికి ఉంటుందన్నారు. చెరువులు ఎండిపోయిన ఇలాంటి సందర్భాల్లో ప్రతీ ఎకరానికి వంద నుంచి 150 టిప్పుల ట్రాక్టర్ల మట్టిని తోలుకోవాలని సూచించారు. ఇలా చేస్తే నేల పైపొర సారవంతగా మారుతుంది. అలాగే పొలంలో తేమ ఎక్కువ రోజులు ఉంటుంది. పొలంలో మట్టి కొట్టుకుంటే పంటలకు యూరియా, పొటాషియం ఎరువుల తక్కువ మోతాదులో వేసుకున్నా దిగుబడి వస్తుంది. టిక్కిమట్టిలో ఉదజని7.4శాతం, నత్రజని 108.33శాతం, భాస్వరం 43.3శాతం, పొటాషియం 227.15 శాతం ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆవు పేడలో 40శాతం న్యూట్రిషన్, 20శాతం పొటాషియం, 10శాతం కాల్షియం ఉంటుందన్నారు. ఇవన్నీ నేలకు సారాన్ని ఇచ్చేవే అన్నారు. పైగా సహజ విధానంలో వాటిని చేకూర్చడం ద్వారా పంట నాణ్యత కూడా బాగుంటుందని చెబుతున్నారు.



వృథాగా పశువుల ఎరువు

సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులను చైతన్యపరచాలి



చాలా మంది రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన లేదు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడి నష్టపోతున్నారు. రైతులు గొర్లు, మేకల, పశువుల ఎరువును వాడితే దిగుబడి పెరగడమే కాక నేలకు సైతం మంచి చేసిన వారం అవుతాం. ప్రతీ సంవత్సరం కచ్చితంగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలి. పచ్చిరొట్ట మొక్కలు పెంచి భూమిలో కలియ దున్నాలి. ఇలాంటి విధాలను పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి.

- కె.జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



మేం తరచూ రైతులను కలిసి రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని చెబుతున్నాం. రసాయన ఎరువులు ఎక్కువ వాడితే మొక్కపచ్చగా వస్తుందేమో గానీ భూసారం నశిస్తుంది. నేల సహజ స్వరూపాన్ని కోల్పోతుందని రైతులకు వివరిస్తున్నాం. పశువుల పేడ, మేకల, గొర్ల ఎరువు, కోళ్ల ఎరువు వాడితే కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నాం. అయితే ఏళ్లుగా రసాయన ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు మా సూచనలు ఎక్కువగా పాటించడం లేదు. పంట మార్పిడి విధానాన్ని తప్పక పాటించాలనీ చెబుతున్నాం.

- జీఎస్.సందీప్‌కుమార్, ఏవో, యాచారం


వికారాబాద్: డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సామగ్రిని తీసుకుంటున్న అధికారులు


వికారాబాద్: బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ


తాండూరు రూరల్: ఎన్నికల సిబ్బందితో పర్యవేక్షిస్తున్న ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి


పరిగి: డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది


మేడ్చల్: డీఆర్‌సీ కేంద్రం వద్ద సామగ్రితో పోలింగ్ సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

సిబ్బందికి ఈవీఎంలు, సామగ్రి అప్పగింత ● ప్రత్యేక వాహనాల్లో పోలింగ్‌కేంద్రాలకు ● భారీ బందోబస్తు

పరిగి/కులకచర్ల/పూడూరు, మే 12: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు(సోమవారం) నిర్వహించనున్న పోలింగ్‌కు ఆదివారం సాయంత్రం సిబ్బంది సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పరిగి మినీస్టేడియం నుంచి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎన్నికల సిబ్బంది బయల్దేరారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.విజయకుమారి ఆధ్వర్యంలో రూట్ అధికారులు ఎన్నికల సిబ్బందికి ఆయా గ్రామాలకు అలాట్ చేశారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. నియోజకవర్గంలోని 305 పోలింగ్‌స్టేషన్‌లకు ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు నలుగురి చొప్పున సిబ్బందిని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను పంపించారు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని 305పోలింగ్ స్టేషన్‌లకు రిజర్వు సిబ్బందితో కలిపి 355మంది ప్రిసైడింగ్ అధికారులు, 355మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 710మంది పోలింగ్ అధికారులతో కలిపి 1420 సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్నారని ఎఆర్వో ఎం.వాసుచంద్ర తెలిపారు.305 పోలింగ్ స్టేషన్‌లకు సిబ్బందిని 54 బస్సులు, 29 తుఫాన్‌ల ద్వారా తరలించినట్లు తెలిపారు. ఈ పోలింగ్ స్టేషన్‌లలో 305మంది బూత్‌స్థాయి అధికారులు, మరో600లకుపైగా పోలీసులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలో 27 రూట్లలో 27 మంది సెక్టోరియల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్స్‌లు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేకంగా వీడియోగ్రాఫర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. అసెంబ్లీ పరిధిలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం ఓటర్లు 2,66,566, వీరిలో పురుషులు 1,33,568, మహిళలు 1,32,989, ఇతరులు 09 మంది ఉన్నారని తెలిపారు. కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల నిర్వాహకులు పోలీసు బందోబస్తు మధ్య గ్రామాలకు చేరుకున్నారు. ఈవీయంలు మరోసారి ట్రయల్ నిర్వహించారు. పూడూరులోని ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో..

మర్పల్లి/మోమిన్‌పేట్/ధారూరు: మర్పల్లి మండలంలోని 27 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో మొత్తం 58 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 44వేల 600 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు మోమిన్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాల్లో 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 38, 635 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల దగ్గర పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఆంజనేయులు, ఎస్సై అరవింద్ తెలిపారు. ధారూరు మండలంలోని ఆరు రూట్లలో 47 పోలింగ్ బూతులకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో ఆదివారం రాత్రి వరకు బస్సుల్లో చేరుకున్నారు. సెక్టోరియల్ అఫీసర్లుగా ఝాన్సీ లక్ష్మి, షఫీ ఉల్లా, నర్సింహులు, సంజూరాథోడ్, శర్భలింగంలు ఆయా పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను, సామగ్రిని సిబ్బందిని తరలించే ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ బూతుల్లో ప్రిసైండింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైండింగ్ అధికారి, అదనపు పోలింగ్ అధికారితో పాటు మరొక అధికారి ఉంటారు. మండలంలో మొత్తం 35, 593 మంది ఓటర్లు ఉండగా, వారిలో 18,067 మంది మహిళ ఓటర్లు,17,526 మంది పురుష ఓటర్లు ఉన్నారు.

తాండూరు నియోజకవర్గ పరిధిలో..

తాండూరు/తాండూరు రూరల్: తాండూరు సెగ్మెంట్‌లో సెయింట్ మార్క్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పీవో, ఏపీవోలకు ఎన్నికల మెటీరియల్‌ను అందజేశారు. తాండూరు ఆర్డీవో ఎన్నికల సహాయ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి పర్యవేక్షణలో మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 26సెక్టార్లలో 277 పోలింగ్ కేంద్రాలకు 1400 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 54 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుండగా 17లొకేషన్లు ఉన్నాయని ఆర్డీవో వివరించారు. 2 లక్షల 43 వేల 192 మంది ఓటర్లుండగా లక్షా 17 వేల 821 మంది పురుషులు, లక్ష 25 వేల 364 మంది మహిళ, 7 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాండూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జరిగిన ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్‌కు 35-40 మంది వరకు సిబ్బంది హాజరు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఎలెక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు గైర్హాజరైన సిబ్బందికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు వెల్లడించారు.

కొడంగల్ నియోజకవర్గంలో..

కొడంగల్/దోమ: పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్, కొడంగల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం పీవో, ఏపీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 2, 41, 749 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 91 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండగా అందులో 85 మంది వినియోగించుకున్నారని పేర్కొన్నారు. 282 పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఓపీవోలను కలిపి 1350 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. 104 మంది సెక్టోరల్ అధికారులు, ఈవీఎంల తరలింపునకు 90 బస్సులతో పాటు తూఫాన్, ఇతర వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎం యంత్రాలు అందించేందుకు 150డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయగా ఓటు వేసేందుకు మొత్తం 1450ఈవీఎం యంత్రాలు, 146 వెబ్‌కాస్టింగ్ కేంద్రాలు, 76కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దోమ మండలంలోని 45 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం పోలింగ్ సిబ్బంది ఈవీఎం యంత్రాలు తదితర సామగ్రితో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్‌బాబు మాట్లాడుతూ సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

శామీర్‌పేట: మండలంలోని ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అదనపు సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్ఓ), మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శామీర్‌పేట మండలంలో పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. మండలంలోని 33 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 66ఈవీఎంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.


జిల్లా ఏఈఆర్వో యాదగిరిరెడ్డి

మండలంలో 33215 మంది ఓటర్లు

శామీర్‌పేట మండలంలో 33215 మంది ఓటర్లు ఉన్నట్లు మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి వెల్లడించారు. మండలంలోని 10 గ్రామాల వారిగా ఓటర్ల వివరాలిలాఉన్నాయి. తుర్కపల్లిలో 3323 మంది ఓటర్లు, యాడారంలో 875, మురహరిపల్లిలో 567 మంది ఓటర్లు, లాల్‌గడిమలక్‌పేట గ్రామంలో 5223 మంది ఓటర్లు, అలియాబాద్‌లో 7013 మంది ఓటర్లు ఉండగా, మజీద్‌పూర్‌లో 2181 మంది ఓటర్లు, శామీర్‌పేట గ్రామంలో 7812 మంది ఓటర్లు, బాబాగూడలో 982, బొమ్మరాశిపేటలో 2269 ఓటర్లు, పొన్నాల్ గ్రామంలో 1970 మంది ఓటర్లు ఉన్నారు. కాగా శామీర్‌పేట మండల పరిధిలో కలిపి మొత్తం పురుష ఓటర్లు 16832 మంది, మహిళా ఓటర్లు 16380 మంది, మొత్తం 33215 మంది ఓటర్లు ఈ సారి లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


పరిగి: ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి


తాండూరు: స్ట్రాంగ్ రూం నుంచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఈవీఎంలు తీసుకెళ్తున్న సిబ్బంది


తాండూరు రూరల్: పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలిన పోలింగ్ సిబ్బంది


ధారూరు: ధారూరు పోలింగ్ బూత్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది


కులకచర్ల: బండవెల్కిచర్ల గ్రామానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


మోమిన్‌పేట: టేకులపల్లిలో పోలింగ్ కేంద్రం దగ్గర ఎన్నికల నిర్వాహణ సిబ్బంది


కొడంగల్: పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది


మర్పల్లి: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఏళ్లుగా కాంగ్రెస్‌ను కాపాడుతున్నాం


మాట్లాడుతున్నరాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్

తాండూరు రూరల్, మే 12: కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నామని అందరి కలిసి కట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేద్దామని కాంగ్రెస్ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేష్ అన్నారు. మండలంలోని కొత్లాపూర్, మల్కాపూర్, ఓగీపూర్, కరన్‌కోట్, బెల్కటూర్, మిట్టబాస్పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం స్థానిక నేతలు, కార్యకర్తలను కలిసి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ఎవరిలో ఏమైనా మనస్పర్ధలు ఉన్నా వాటిని పక్కనబెట్టి పార్టీ గెలుపునకు పనిచేయాలని సూచించారు. ఎన్నికల తర్వాత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం.రమేష్ మొదటిసారిగా తాండూరు మండలంలో పర్యటించిన సందర్భంగా కొత్లాపూర్ గోపాల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, కోతి గోపాల్, జెర్నె నాగప్ప, తలారి నర్సింహులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామానుజ జయంతి

కొడంగల్, మే 12: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామానుజ జయంతి సందర్భంగా అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణతో పట్టు వస్త్రాలు, పూలమాలలతో రామానుజ జీయర్‌స్వామి మూల విరాట్‌కు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

సమాజహితానికి ఓటు వేయాలి


ఘట్‌కేసర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, మే 12: కులానికో, మతానికో కాకుండా సమాజ హితానికి, సమసమాజ స్థాపనకు ఓటు వేయాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో అరుణ్‌కుమార్ స్థానిక పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎజ్జల కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచిన్, దాసు, శేఖర్, అశోక్, రాజేష్, అరుణ్, శ్రీనివాస్, ప్రవీణ్, అంజయ్య పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేక డబ్బు, మద్యం పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, మే 12: ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాక కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఓట్ల కోసం డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీకి 10 నుంచి 12సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. డబ్బులు వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలనుకునే పార్టీలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రధానంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయా పార్టీ డబ్బు, మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎవ్వరూ మద్యానికి, డబ్బులకు ఆశపడి ఓటు వేయొద్దని కోరారు. చైతన్యవంతులై, విజ్ఞానంతో దేశంకోసం ధర్మంకోసం ఓటువేయాలని కోరారు. ఇక్కడి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిరుడి రామారావు, కరుణాకర్, గొంగళ్ల బాలేష్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం


భక్తుడికి రశీదు అందిస్తున్న ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్

చేర్యాల, మే 12: భక్తుల ఆకలి తీర్చేందుకు సిద్దిపేట జిల్లా చేర్యాలలోని మల్లన్న ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన పులిపాక దేవమణి దంపతులు ఆదివారం రూ.1,00,116విరాళం అందించారు. ఈసందర్భంగా ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్ వారికి రశీదు, స్వామి వారి ప్రసాదం అందించారు.

సీనియర్ పాత్రికేయుడు కన్నుమూత


వెంకటయ్య

బొంరాస్‌పేట్, మే 12: బొంరాస్‌పేట్ మండలానికి చెందిన సీనియర్ విలేకరి వెంకటయ్య ఆదివారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల బొంరాస్‌పేట్ మండల విలేకరులు, టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు కిషన్, టి.పకీరప్ప, టి.అంజిలయ్య, గోపాల్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. వెంకటయ్య అకాల మృతి చాలా బాధాకరమన్నారు.

కళలపై నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఆమనగల్లు, మే 12 : విద్యార్థులు విద్యతో పాటు కళలపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గ్రామీణ కళలకు జీవంపోయాల్సిన అవసరం ఉందన్నారు. ఆమనగల్లుకు చెందిన శృతిలయ కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో వెల్దండలో విద్యార్థులకు వేసవి నృత్య సంగీత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఐక్యత, వందేమాతరం ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజులు నిర్వహించే శిబిరాన్ని కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ కార్యదర్శి వనం విజయ్‌కుమార్, సభ్యులు అభినవ్ రెడ్డి, శ్రీరామ్, జ్యోతి, మంజుల, రవళి, ప్రసన్న, శ్రీకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కులకచర్ల, మే 12: మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో మృతుల కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం పరిగి ఎమ్మెల్యే స్థానిక గౌడసంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. తిరుమలపూర్ గ్రామంలో నిర్మించిన చోటే యువకుడు బండి యాదయ్య (33)మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన తుప్పుడు బాలమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పందించారు. తాను అందుబాటులో లేకపోయినా కార్యకర్తలతో మృతుల కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రెండు కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.10వేలు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


మాజీ సర్పంచ్ ఆశప్పకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, మే 12: కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆశప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ తదితరులు సంతాపం తెలిపారు. గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

క్రైం కార్నర్

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


స్వప్న(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, మే 12: పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన కాసర్ల సతీష్ భార్య మృతిచెందగా తరువాత 2009లో తన కూతురు కాసర్ల స్వప్నను ఘనాపూర్ సమీపంలోని హ్యాపీ అర్బాన్ హోమ్‌లో చేర్పించి చదివించాడు. స్వప్నకు ఇంటర్ రెండవ సంవత్సరం ఒకేషనల్ పరీక్షా ఫలితాల్లో వెయ్యికి గాను 700మార్కులు వచ్చాయి. దీంతో తోటి విద్యార్థినులతో తనకు తక్కువ మార్కులు వచ్చాయని బాధపడుతుండేది. ఆదివారం సాయంత్రం హోమ్‌లోని తన గదిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన తోటివిద్యార్థినులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం


పొలంలో దగ్ధమవుతున్న గడ్డివాము

ధారూరు, మే 12: పశువులకు మేత కోసం పొలాల వద్ద రైతులు నిల్వ ఉంచిన పశుగ్రాసం కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని గట్టేపల్లి శివారులోని పొలాల్లో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధిత రైతులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గట్టేపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పొలాల్లో వరి గడ్డి వాములను నిల్వ ఉంచారు. కాగా, రాంపూర్ తండాకు చెందిన రైతు దేవేందర్ పక్క పొలాల రైతులు వారిస్తున్నా వినకుండా తన పొలంలో నిప్పుపెట్టాడు. ఈ పొలంలోని మంటలు గాలి ధాటికి పక్క పొలాల్లోని నాలుగు గడ్డివాములకు వ్యాపించి పూర్తిగా దగ్ధమయ్యాయి. గడ్డివాములతో పాటు పొలంలో ఉన్న పైపులైన్ పైపులు, విద్యుత్ తీగలు, స్టార్టర్లు కాలిపోయాయని బాధిత రైతులు జగన్, లక్ష్మయ్య, అంజయ్యలు తెలిపారు. ఈ ఘటనపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పూడూరు, మే 12: ఆర్థిక సమస్యలతో బాధపడుతూ పురుగుల తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన పూడూరు మండలంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాలోని చెముగోడు గ్రామానికి చెందిన శ్రీధర్(32) పూడూరు మండలం చీలాపూర్ గేటు సమీపంలో గల కేశవరెడ్డి స్కూల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా శ్రీధర్ ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఈనెల 10వ తేదీన తన రూంలో పురుగులమందు తాగాడు. స్థానికులు వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య తమ్మాలి బిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.